TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 306 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ సోమవారం.01.06.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

## ‘ఎండలున్నాయ్ జాగ్రత్త- ఎక్కడికెళ్లినా నీళ్లు వెంట తీసుకెళ్లండి’- ప్రజలకు మోదీ మరోసారి సూచనలు



న్యూఢిల్లీ, అమృత్ తెలంగాణ: మన్‌కీ బాత్ 134వ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. ఎండల దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. బయటకు వెళ్లాల్సి వస్తే తాగునీరు వెంట ఉంచుకోవాలని మరోసారి సూచించారు. వివిధ రాష్ట్రాల్లో ఎండల నుంచి ఉపశమనం కోసం తాగే పానీయాల గురించి ప్రధాని ప్రస్తావించారు. మజ్జిగ, షర్బత్, తదితర పానీయాలను తాగాలని ప్రజలకు సూచించారు. ఆ తర్వాత కేరళ ఆలువా ప్రాంతంలో స్విమ్మింగ్ క్లబ్ సేవలను మోదీ ప్రశంసించారు. 15 వేల మంది ఔత్సాహికులకు క్లబ్ నిర్వహకులు ఉచితంగా ఈత నేర్పించారని తెలిపారు. ఇటీవల ఝార్ఖండ్‌లో అథ్లెటిక్స్ గురించి ప్రస్తావించిన మోదీ నాలుగు విభాగాల్లో క్రీడాకారులు రికార్డులు సృష్టించారని అన్నారు. వంద మీటర్ల పరుగులో గుర్వీందర్, అనిమేష్ రికార్డులు సృష్టించారని వెల్లడించారు. ఈ సందర్భంగా గుర్వీదర్, అనిమేష్ పరుగు పందెంలో తమ అనుభవాలను ప్రధాని మోదీతో పంచుకున్నారు. అలాగే, పురాణ కాలం నాటి అపూర్వ సంపద గురించి మోదీ ప్రస్తావించారు. ఈ సందర్భంగా చోళుల కాలం నాటి తామర పత్రాల విశిష్టత, ఛత్తీస్‌గఢ్‌లో లభించిన పాండవుల కాలం నాటి తామరపత్రాల గురించి వివరించారు.

“కొద్ది రోజుల క్రితం నెదర్లాండ్స్‌ను సందర్శించే అవకాశం నాకు లభించింది. అక్కడ నేను అనేక సమావేశాల్లో పాల్గొన్నాను. అయితే, అక్కడ జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో చోళుల కాలం నాటి పురాతన రాగి ఫలకాలను భారత్‌కు అప్పగించారు. అంతేకాదు, ఆ కార్యక్రమానికి నెదర్లాండ్స్ ప్రధాని కూడా హాజరయ్యారు. ఈ ఫలకాల గురించి దేశం నలుమూలలు, విదేశాల నుంచి నాకు నిరంతరం సందేశాలు వస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళ సమాజాల్లో కూడా ఒక ప్రత్యేకమైన ఉత్సాహం నెలకొని ఉంది. వీటిలో 21 పెద్ద, 3 చిన్న రాగి ఫలకాలు ఉన్నాయి. అవి ప్రధానంగా మొదటి రాజేంద్ర చోళ మహారాజుకు సంబంధించినవి. ఆనైమంగళం గ్రామాన్ని బౌద్ధ విహారానికి ఇచ్చినట్లు ఇందులో పేర్కొన్నారు. అవి చోళ రాజవంశం విజయాలను వివరిస్తాయి. ఆ రాజవంశం బలమైన సముద్ర శక్తిని చూపిస్తాయి. ఆగ్నేయాసియా దేశాలతో వారి సంబంధాల గురించి కూడా సమాచారాన్ని అందిస్తాయి. చోళ సామ్రాజ్యం గొప్ప చరిత్ర, సంస్కృతి మనందరికి గర్వకారణం. అటువంటి అమూల్యమైన వారసత్వ సంపదను పరిరక్షించడానికి మా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది.”

–నరేంద్ర మోదీ, భారత ప్రధాని

ఖగోళ శాస్త్రం తరతరాలుగా భారతీయులను ఆకర్షించిందని, గ్రామీణ ప్రాంతాల్లో ఈ విషయాన్ని ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి బెంగళూరు ఖగోళ సొసైటీ ఒక కార్యక్రమాన్ని ప్రారంభించిందని మోదీ నొక్కి చెప్పారు. అలాగే, రాత్రిపూట నక్షత్రాలను చూడటం అనేది ఒక అద్భుతమైన అనుభవమని, ఆస్ట్రో కేరళ అనే సంస్థ రాత్రిపూట పరిశీలన శిబిరాలు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తుందని ఆయన చెప్పారు. అక్కడి యువత టెలిస్కోపులు తయారు చేయడం, నక్షత్ర పటాలను ఉపయోగించడం నేర్చుకుంటున్నారని అన్నారు. “రాజ్‌కోట్‌లోని బిగ్ బ్యాంగ్ ఆస్ట్రానమీ క్లబ్ గిర్ అడవుల నుంచి రాన్ ఆఫ్ కచ్ వరకు అనేక ఖగోళ శాస్త్ర కార్యక్రమాలను నిర్వహించింది” అని మోదీ అన్నారు.

మన్ కీ బాత్ స్ఫూర్తితో సైనికులకు విరాళం

మరోవైపు, తమిళనాడులోని నాగర్‌కోయిల్‌కు చెందిన విద్యావేత్త గిరిజా అమ్మ గురించి మోదీ మాట్లాడారు. ఆమె చెన్నైలోని జైగోపాల్ గరోడియా హిందూ విద్యాలయంతో సహా 15 పాఠశాలలను నడుపుతున్నారని చెప్పారు. ఆమె దేశభక్తి స్ఫూర్తి ప్రతి భారతీయుడికి ఉత్తేజం ఇస్తుందన్నారు. “మన్ కీ బాత్ స్ఫూర్తితో, ఆమె దేశంలోని అనేక మంది సైనికులకు విరాళం ఇవ్వడానికి ప్రతిజ్ఞ చేశారు. ఇది చేయడానికి, ఆమె తన పాఠశాలలన్నింటిలోని విద్యార్థులను ప్రేరేపించారు. ధైర్యవంతులైన సైనికుల కోసం ప్రతిరోజూ ఒక రూపాయి విరాళంగా ఇవ్వమని ఆమె పిల్లలను కోరారు. అంటే, ప్రతి విద్యార్థి ఒక సంవత్సరంలో 365 రూపాయలు సేకరించారు. ఈ చిన్న విరాళాల ద్వారా సుమారు 40 లక్షల రూపాయలు సేకరించారు” అని మోదీ పేర్కొన్నారు.

చెన్నైలోని మొట్టమొదటి హిందూ పాఠశాల గత సంవత్సరం తన 50వ వార్షికోత్సవాన్ని జరుపుకుందని మోదీ పేర్కొన్నారు. “దేశ విద్య, సాంస్కృతిక గౌరవాన్ని పెంపొందించడంలో ఈ పాఠశాలల పోషిస్తున్న పాత్ర ప్రశంసనీయం. ఇందులో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరినీ నేను అభినందిస్తున్నాను. ముఖ్యంగా మన ధైర్యవంతులైన సైనికులకు విరాళాలు అందించిన విద్యార్థులను ప్రశంసిస్తున్నాను. భారతదేశంలోని ప్రతి గ్రామంలో, నగరంలో మనకు స్ఫూర్తినిచ్చే ఏదో ఒక సంఘటన జరుగుతూనే ఉంది” అని మోదీ పేర్కొన్నారు.

## తెలుగు రాష్ట్రాల ప్రజలకు చల్లని కబురు




హైదరాబాద్ : అమృత్ తెలంగాణ:భానుడి ప్రతాపంతో అల్లాడుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు అందించింది. మరో పది రోజుల్లో నైరుతి రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకనున్నాయి. జూన్ 10 నుంచి 12వ తేదీ మధ్య తెలంగాణలోకి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీంతో ఎండల తీవ్రత తగ్గి, వర్షాలు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం కేరళ, దాని పరిసర ప్రాంతాల్లో విస్తరించిన నైరుతి రుతుపవనాలు రానున్న నాలుగైదు రోజుల్లో తమిళనాడులోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించనున్నాయి. ఇందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనాల కారణంగా రుతుపవనాలు వేగంగా ముందుకు కదులుతున్నాయని అధికారులు తెలిపారు. లక్షద్వీప్, కొమోరిన్ ప్రాంతం నుంచి ఈశాన్య బంగాళాఖాతం వరకు రుతుపవనాలు ఇప్పటికే విస్తరించాయి. రుతుపవనాల రాకతో రాష్ట్రంలో ఎండల తీవ్రత, వడగాల్పులు క్రమంగా తగ్గుముఖం పడతాయని అధికారులు తెలిపారు. శనివారం ఆసిఫాబాద్ జిల్లా దేహాగాన్‌లో రికార్డు స్థాయిలో 46.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనప్పటికీ, రానున్న రోజుల్లో ఉపశమనం లభించనుంది.

జూన్ 1 నుంచి హైదరాబాద్‌లో పగటి ఉష్ణోగ్రతలు 36–38 డిగ్రీలకు, ఇతర జిల్లాల్లో 40–42 డిగ్రీలకు తగ్గుతాయని అంచనా. జూన్ 5 తర్వాత రాష్ట్రవ్యాప్తంగా సగటు ఉష్ణోగ్రతలు 38–39 డిగ్రీల మధ్య స్థిరపడనున్నాయి. కాగా, ఆది, సోమవారాల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది.

## కూల్చివేతలను పునరుద్ధరించాలి



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ:కోర్టుల ఆదేశాలు అమల్లో ఉన్నప్పటికీ కూకట్‌పల్లి భూ వివాదంలో హైడ్రా చేపట్టిన కూల్చివేతలపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కోర్టుకు ఇచ్చిన హామీలను, ఇప్పటికే జారీ చేసిన ఉత్తర్వులను పక్కనపెట్టి రాత్రికి రాత్రే నిర్మాణాలను తొలగించడం సమంజసం కాదని వ్యాఖ్యానించింది. పిటిషనర్‌కు చెందిన స్థలంలో ఈ నెల 25వ తేదీ నాటికి ఉన్న పరిస్థితిని 24 గంటల్లో పునరుద్ధరించాలని హైడ్రా, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్, సంబంధిత తహసీల్దార్‌లకు ఆదేశాలు జారీ చేసింది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లిలోని సర్వే నెంబర్లు 1003 నుంచి 1006 వరకు విస్తరించిన 13.17 ఎకరాల భూమికి సంబంధించి ఈ వివాదం తలెత్తింది. ఈ నెల 26వ తేదీ తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా హైడ్రా అధికారులు కాంపౌండ్ గోడలు, ఫెన్సింగ్, భద్రతా సిబ్బంది గదులు, ప్రవేశ ద్వారాలను కూల్చివేశారని ఎన్‌వీఎన్ కన్స్ట్రక్షన్స్ ఆరోపించింది. అంతేకాక అక్కడ ఉన్న యంత్రాలు, ఇతర సామగ్రిని ధ్వంసం చేయడంతో పాటు విద్యుత్ సరఫరాను నిలిపివేశారని పేర్కొంటూ మూడు వేర్వేరు కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలు చేసింది. ఈ పిటిషన్లను విచారించిన జస్టిస్ నగేశ్ భీమపాక, ప్రాథమిక ఆధారాలను పరిశీలించిన అనంతరం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. కోర్టు ఆదేశాలు అమల్లో ఉన్న కేసుల్లోనూ, కోర్టుకు హామీలు ఇచ్చిన వ్యవహారాల్లోనూ హైడ్రా తన ఇష్టానుసారంగా వ్యవహరించడం ఆందోళనకరమని వ్యాఖ్యానించారు. ముందుగా కూల్చివేతలు చేపట్టి, ఆ తరువాత వాటిని సమర్థించుకునే ప్రయత్నం చేయడం హైడ్రాకు అలవాటుగా మారినట్లుగా కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు. కోర్టు ముందు ఉన్న రికార్డులను పరిశీలిస్తే గత ఆదేశాలను ఉల్లంఘించినట్లు ప్రాథమికంగా కనిపిస్తోందని, ఇదే అంశంపై ధిక్కరణ పిటిషన్ పెండింగ్‌లో ఉండగానే చేపట్టిన చర్యలు సందేహాలకు తావిస్తున్నాయని పేర్కొన్నారు. పిటిషనర్లు సమర్పించిన ఆధారాల ప్రకారం హైడ్రా స్వయంగా కోర్టుకు ఇచ్చిన హామీని కూడా పాటించలేదని గమనించారు. దీంతో వివాదాస్పద స్థలంలో ఈ నెల 25వ తేదీకి ముందు ఉన్న పరిస్థితిని పూర్తిగా పునరుద్ధరించాలని ఆదేశించారు. ఫెన్సింగ్, భద్రతా సిబ్బంది గదులు, ప్రవేశ ద్వారం, విద్యుత్ లైన్లు, లైటింగ్‌తోపాటు ఇతర మౌలిక వసతులన్నింటినీ తిరిగి ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. స్థలం వద్ద హైడ్రా, రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను తొలగించి, బోర్డులను కూడా తీసేయాలని ఆదేశించారు. అధికారులు ఆదేశాలను అమలు చేయకపోతే పునరుద్ధరణకు అయ్యే వ్యయాన్ని ప్రతివాదుల నుంచే వసూలు చేసుకునే హక్కు పిటిషనర్లకు ఉంటుందని పేర్కొన్నారు. తదుపరి విచారణను జూన్ 4కు వాయిదా వేశారు.

## రైతు డిస్కమ్ వల్ల తాగునీటి ప్రాజెక్టులకు కూడా కరెంట్ కోతలు వస్తాయి: హరీశ్‌రావు

### రైతు డిస్కమ్ వల్ల తాగునీటి ప్రాజెక్టులకు కూడా కరెంట్ కోతలు వస్తాయన్న మాజీ మంత్రి హరీశ్‌రావు - ప్రస్తుతం రైతులకు 13 గంటలకు మించి కరెంట్ ఇవ్వట్లేదని ఆరోపణ



హైదరాబాద్, అమృత్ తెలంగాణ: రైతు డిస్కమ్ రైతుల పాలిట శాపంగా మారనుందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు డిస్కమ్ వల్ల తాగునీటి ప్రాజెక్టులకు కూడా కరెంట్ కోతలు వస్తాయని ఆరోపించారు. రైతులకు 3 గంటల విద్యుత్ చాలు అని కాంగ్రెస్ నేతలు ఎప్పటినుంచో అంటున్నారన్నారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తేనే ఓట్లు అడుగుతానని రేవంత్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులకు 7 గంటల విద్యుత్ మాత్రమే ఇస్తున్నారు : ప్రస్తుతం రైతులకు 13 గంటలకు మించి కరెంట్ ఇవ్వట్లేదని హరీశ్రావు ఆరోపించారు. రైతు డిస్కమ్ ఏర్పాటుతో 7 - 8 గంటలే ఇచ్చేందుకు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. గుజరాత్‌లో రైతులకు 7 గంటల విద్యుత్ మాత్రమే ఇస్తున్నారని అన్నారు. బడే భాయి మోదీ విధానాలనే రాష్ట్రంలో అమలు చేసేందుకు చోటా భాయి ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. రైతు డిస్కమ్‌కు సౌర విద్యుత్ మాత్రమే ఇస్తామని జీవోలో పేర్కొన్నారని తెలిపారు. కేవలం సౌరవిద్యుత్‌తో ఎత్తిపోతల ప్రాజెక్టుల మోటార్లు ఎలా నడుస్తాయని హరీశ్రావు ప్రశ్నించారు.

“రైతు డిస్కమ్ వల్ల తాగునీటి ప్రాజెక్టులకు కూడా కరెంట్ కోతలు వస్తాయి. రైతులకు 3 గంటల విద్యుత్ చాలు అని కాంగ్రెస్ నేతలు ఎప్పటినుంచో అంటున్నారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తేనే ఓట్లు అడుగుతానని రేవంత్‌రెడ్డి చెప్పాలి. ప్రస్తుతం రైతులకు 13 గంటలకు మించి కరెంట్ ఇవ్వట్లేదు. రైతు డిస్కమ్‌కు సౌర విద్యుత్ మాత్రమే ఇస్తామని జీవోలో పేర్కొన్నారు. కేవలం సౌరవిద్యుత్‌తో ఎత్తిపోతల ప్రాజెక్టుల మోటార్లు ఎలా నడుస్తాయి?” – హరీశ్‌రావు, మాజీ మంత్రి

రైతు మెడకు ఉరి పెట్టే డిస్కం : రైతు డిస్కం పేరుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్త నాటకం ఆడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. రేవంత్ రెడ్డి గతంలో సాగుకు రోజుకు 3 గంటల విద్యుత్ చాలని అన్నారని తెలిపారు. ప్రస్తుతం మాటమార్చి రైతు డిస్కం ఏర్పాటు చేస్తామంటున్నారని అన్నారు. రైతు మెడకు ఉరి పెట్టే డిస్కం అది అని విమర్శించారు.

రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రానికి ఏం చేశారు? : కంటోన్మెంట్ ఉప ఎన్నిక సమయంలో స్థానికంగా ఆరు వేల ఇళ్లు కట్టిస్తామని, ఇప్పటి వరకు ఆరు ఇళ్లయినా కట్టించారా? కేటీఆర్ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి 420 హామీలు అమలు చేసి చూపించాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్ అప్పులు చేసి సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేశారని, రూ.4 లక్షల కోట్ల అప్పులు చేసిన రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రానికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.

## పాలమూరు -రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ సహా పెండింగ్ ప్రాజెక్టు పనులు వేగవంతం



మహబూబ్‌నగర్.అమృత్ తెలంగాణ:పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుతో పాటు అన్ని పెండింగ్ ప్రాజెక్టులు పనులు పూర్తి చేస్తామని నీటి పారుదల శాఖ,పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.శనివారం మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో 32.05 కోట్ల రూపాయలతో నిర్మాణం చేయనున్న అజిలాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి రాష్ట్ర పశు సంవర్ధక,మత్స్య,పాడి అభివృద్ధి,క్రీడలు,యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీ హరి,రాష్ట ప్రణాళిక సంఘం ఉపాధ్యక్ష?్నలు జి.చిన్నారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అజిలాపురం లిఫ్ట్ ఇరిగేషన్ పనులు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు.. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ వల్ల అజిలా పురం,గద్దె గూడెం, వెంకటాయ పల్లి గ్రామాలకు 1400 ఎకరాల ఆయకట్టుకు కోయిల్ సాగర్ నుండి సాగు నీరు అందుతుందన్నారు. అదేవిధంగా కల్వకుర్తి, నెట్టెంపాడు,భీమా,తదితర ప్రాజెక్టులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని తెలిపారు. వాటి పనులను కూడా పూర్తి చేస్తామన్నారు.. పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులు 90 శాతం పూర్తి చేశామని గత పాలకులు చెప్పటం అబద్ధం అన్నారు.జూన్ 4,5 తేదీల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాలో పర్యటించి నిధులు మంజూరు చేయనున్నట్టు తెలిపారు. జూన్ 4 న జూరాల నుండి ప్రారంభించి 4,5 తేదీల్లో కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, నార్లా పూర్, ఉద్దండాపూర్ రిజర్వాయర్ లను పర్యటించనున్నట్టు తెలిపారు. వచ్చే రెండున్నర సంవత్సరం కాలంలో పూర్తి చేస్తామన్నారు. శాసన సభ్యులు జి.మధు సూదన్ రెడ్డి కోరిన విధంగా చౌదరి పల్లి లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేస్తానని సానుకూలంగా స్పందించారు. అదేవిధంగా పి.ఏసి.ఎస్.కొనుగోలు కేంద్రాన్ని ఉత్తమ్ కుమార్ రెడ్డి,వాకిటి శ్రీ హరి సందర్శించారు. కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లు, ఎం.ఎస్.పి చెల్లింపు పై రైతులతో మాట్లాడారు.

## వికలాంగుల చట్టాలను మార్చాలని చూస్తే ఊరుకోం

యాదగిరిగుట్ట.అమృత్ తెలంగాణ: వికలాంగుల చట్టాలను మార్చాలనే కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొడ్తామని ఎన్‌పీఆర్డీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నంబురాజన్ అన్నారు. శనివారం యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న శిక్షణా తరగతుల సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో హిందూత్వ మతోన్మాద విధానాలను అమలు చేస్తున్నదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం పేదల కోసం కాకండా సంపన్నుల కోసం పని చేస్తున్నదని చెప్పారు. దేశ సార్వభౌమాధికారాన్ని అమెరికా సామ్రాజ్యవాదులకు కట్టాబెడుతూ దేశ భక్తి గురించి మాట్లాడుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వికలాంగుల కోసం ఉన్న అనేక చట్టాలను రద్దు చేయడంతో పాటు సవరణలు చేస్తుందని విమర్శించారు. నిధులు కేటాయించకుండా అందరికి యూడీఐడీ కార్డ్స్ ఇవ్వడం ఎలా సాధ్యం అవుతుందని ప్రశ్నించారు. దేశ వ్యాప్తంగా 15 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రతి వికలాంగునికి అంత్యోదయ రేషన్ కార్డ్స్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. పెన్షన్లలో కేంద్ర ప్రభుత్వం వాటా 300 రూపాయలే ఉందని, పెరుగుతున్న ధరల వలన రూ.300తో వికలాంగుల కుటుంబాలు ఎలా బతుకుతాయని అన్నారు. కేంద్రప్రభుత్వ వాటా పెంచాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు వికలాంగుల పాలిట శాపంగా మారాయని అన్నారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం అమల్లోకి వచ్చి 10 ఎండ్లు అవుతున్న చట్టాన్ని అమలు చేయడంలో ఎందుక నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. సామూహిక ప్రాంతాలను అవరోధ రహితంగా మార్చాలని ప్రవేశ పెట్టిన పథకం అమలులో ప్రభుత్వం విఫలమైందన్నారు. కొత్త ఉపాధి చట్టంతో వికలాంగులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. ఎన్‌పీఆర్డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. సహాయ పరికరాలను పంపిణీ చేయడంలో కాలయాపన ఎందుకు చేస్తున్నారని అన్నారు.


# జనగణన హెచ్.ఎల్.ఓ లోపాల సవరణ, ఇందిరమ్మ ఇండ్ల మహా గృహప్రవేశాలను అత్యంత ప్రాధాన్యత తో పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులకు దిశానిర్దేశం






అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ జనగణన హెచ్.ఎల్.ఓ డేటాలోని లోపాల సవరణతో పాటు, ఇందిరమ్మ ఇండ్ల మహా గృహప్రవేశాల కార్యక్రమాలను అత్యంత ప్రాధాన్యతతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. ఆదివారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి సంబంధిత జిల్లా, మండల, మున్సిపల్ అధికారులకు ఆయన గూగుల్ మీట్ ద్వారా సుదీర్ఘ సమీక్షా సమావేశాన్ని నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జనాభా గణనకు సంబంధించిన హెచ్.ఎల్.ఓ డేటాలో ఉన్న అన్ని రకాల అసంబద్ధతలను, లోపాలను క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా తక్షణమే సరిచేయాలని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో మాస్టర్ ట్రైనర్లు, సూపర్వైజర్లు, చార్జ్ అధికారులు, వార్డు అధికారులు పూర్తి సమన్వయంతో వ్యవహరించి తప్పుల్లేని డేటాను సిద్ధం చేయాలని ఆదేశించారు. అదేవిధంగా, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి, 'మహా గృహప్రవేశం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గృహనిర్మాణ శాఖకు చెందిన డీఈలు, ఏఈలు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనుల ప్రగతిని పర్యవేక్షించాలని, అధికారులు తమకు కేటాయించిన విధుల్లో ఎలాంటి అలసత్వాన్ని ప్రదర్శించకుండా వంద శాతం లక్ష్యాలను సాధించాలని హెచ్చరించారు. ఈ వర్చువల్ సమీక్షా సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా రెవెన్యూ అధికారి స్రవంతి, జిల్లా పరిషత్ సీఈఓ రవి, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, హౌసింగ్ పీడీ శంకర్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఎంపీడీఓలు, చార్జ్ అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సూపర్వైజర్లు, మాస్టర్ ట్రైనర్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# తోటి ప్రయాణికులతో మంత్రి ముచ్చట్లు.. రైలులోనే భోజనం



హైదరాబాద్, పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం మరో కీలక ఘట్టానికి చేరుకోనుంది. తొలి విడత ఇళ్ల నిర్మాణం పూర్తయి లబ్ధిదారులు గృహప్రవేశాలకు సిద్ధమవుతుండగా, రెండో విడతకు కూడా ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి సోమవారం కుమ్రం భీం-ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. కొత్తగూడలో తొలి విడత కింద నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి ముఖ్యమంత్రి సామూహిక గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొననున్నారు. అనంతరం కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్డు వద్ద నిర్వహించే భారీ బహిరంగ సభలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది పేద కుటుంబాలకు గూడు కల్పించే దిశగా ఈ కార్యక్రమం మరో ముందడుగుగా నిలవనుంది. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించేందుకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు మధ్యాహ్నం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరిన సాయంత్రం కాగజ్‌నగర్‌కు చేరుకున్నారు. రైలు ప్రయాణం సందర్భంగా మంత్రి జూపల్లి తోటి ప్రయాణికులతో ముచ్చటించారు. వందే భారత్ ట్రైన్ లో మధ్యాహ్న భోజనం చేశారు ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మరికాసేపట్లో సభా ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలు, హెలిపాడ్, వేదిక ఏర్పాట్లు, సదుపాయాలను మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. ఇందిరమ్మ ఇళ్ల తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్ల నిర్మాణ ప్రక్రియ ప్రారంభమై వేగంగా కొనసాగుతోంది. రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనం, సొంతింటి భరోసా కల్పించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్న ఈ పథకానికి కుమ్రం భీం-ఆసిఫాబాద్ జిల్లా వేదిక కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవానికి ఈ జిల్లా నుంచే ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టనుండటంతో ప్రభుత్వ గృహ విప్లవంలో ఇది మరో చారిత్రక ఘట్టంగా నిలవనుంది.

# జగిత్యాల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ పరిచయ ఆత్మీయ సమ్మేళనం : హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్





జగిత్యాల అమృత్ తెలంగాణ మే 31: పట్టణ ప్రెస్ క్లబ్ టీయూ డబ్ల్యూ జె ఐ జె యూ అధ్యక్షులు రాజేందర్ రెడ్డి ప్రధాన కార్యదర్శి శశి మరియు నూతన కార్యవర్గ పరిచయ మరియు ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై,నూతన కార్యవర్గ సభ్యులను,అభినందించి,సత్కరించిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ .ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య గ్రంథాల సంస్థ ఛైర్మెన్ దినేష్ టి పి సి సి సెక్రటరీ బండ శంకర్ ఏ ఎం సి ఛైర్మెన్ గడ్డం నారాయణరెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు దుమాల రాజ్ కుమార్ సీనియర్ పాత్రికేయులు టివి సూర్యం మహేష్ కౌన్సిలర్ లు అరవ లక్ష్మీ రాజు, దయల చంద్రకళ,శంకర్,హరీష్,స్వప్నగిరిధర్, పట్టణ నాయకులు,మీడియా మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# అత్యంత అరుదైనా రక్తాన్ని దానం చేసిన యువకుడు



మెట్ పల్లి అమృత్ తెలంగాణ మే 31: పట్టణంలోని ప్రభుత్వ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న భవాని అను మహిళకు అత్యవసర చికిత్స నిమిత్తం ఎబి నెగటివ్ రక్తం అవసరం అని డాక్టర్ చెప్పడంతో, అరుదైనా రక్తం కాబట్టి పేషెంట్ కుటుంబ సభ్యులు డోనర్ కోసం వెతుకుతూ రక్తదాతల అనుసంధాన కర్త ఉదయ్ కుమార్ సంప్రదించగా జగిత్యాల పట్టణానికి చెందిన చిరంజీవి సమాచారం తెలుపగ చిరంజీవి వెంటనే స్పందించి జగిత్యాల లోని భారతి బ్లడ్ బ్యాంక్ కి వెళ్లి రక్తం ఇవ్వడం జరిగింది ఎబి నెగటివ్ రక్తం అత్యంత అరుదుగా తక్కువ మందికి ఉంటుంది కాబట్టి అత్యవసర సమయంలో ఎబి నెగటివ్ రక్తం కోసం సహకరించిన శాశ్వత రక్తదాత మహమ్మద్ బాబుజన్ కి,నిర్వాహకుడు అఖిల్ , సాగర్ కి, మెట్పల్లి గవర్నమెంట్ హాస్పిటల్ సూపరిండెంట్ సాజిద్ కి, జగిత్యాల భారతి బ్లడ్ బ్యాంక్ మంజూర్ కి, జలపతి కి, పేషెంట్ కి ఇంకొక యూనిట్ ఎబి నెగటివ్ రక్తం ఇవ్వడానికి సిద్ధమైన రాజారెడ్డి ఎబి నెగటివ్ బ్లడ్ డోనర్ అత్యవసర సమయంలో ఎబి నెగటివ్ రక్తం అడగగానే వెంటనే స్పందించి రక్తదానం చేసిన చిరంజీవిప్రత్యేకంగా ధన్యవాదములు,తెలుపుతున్నాము అన్నారు.

# వరి ధాన్యం ప్రక్రియ నిబంధనల ప్రకారం చేపట్టాలి : జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





అమృత్ తెలంగాణ మంచిర్యాల జిల్లా న్యూస్ మే 31, 2026: రైతు సంక్షేమంలో ప్రభుత్వం చేపట్టిన కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలను నిబంధనల ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.

ఆదివారం జిల్లాలోని చెన్నూర్ మండలం ఒతుకులపల్లి, ఆస్నాద్, సోమనపల్లి లలో గల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు, చెన్నూర్ మండల కేంద్రంలోని గోదామును మండల తహసిల్దార్ మల్లికార్జున్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని, కొనుగోలు ప్రక్రియను ఎలాంటి అవాంతరాలు లేకుండా పారదర్శకంగా, వేగంగా నిర్వహించాలని తెలిపారు. ఈ క్రమంలో కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, తూకం యంత్రాలు, ప్యాడీ క్లీనర్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యాన్ని గోదాములలో నిల్వ చేయాలని తెలిపారు. ధాన్యం నిల్వ, తరలింపులో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశిత సమయానికి అనుగుణంగా ధాన్యం ప్రక్రియను వేగవంతం చేయాలని, లక్ష్యాలను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు మరియు BLA-2 ల సమావేశానికి' ముఖ్యఅతిథిగా విచ్చేసిన పెద్దపల్లి ఎంపీ




అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు మరియు దీూా-2 ల సమావేశానికి' ముఖ్యఅతిథిగా విచ్చేసిన పెద్దపల్లి ఎంపీ, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జి గడ్డం వంశీ కృష్ణ కి ఖానాపూర్ ఎమ్మెల్యే, నిర్మల్ డిసిసి అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్ గారు, ఆదిలాబాద్ డిసిసిఅ అధ్యక్షులు నరేష్ జాదవ్ తో కలిసి, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి శాలువాతో ఘన స్వాగతం పలికారు.

అనంతరం కాంగ్రెస్ నాయకులతో కలిసి కార్యకర్తలకు దిశనిర్దేశం చేసారు. అనంతరం బోథ్ నియోజకవర్గం ఇంచార్జ్, టీపిసిసి ప్రధాన కార్యదర్శి రమేష్ బాబు ని సన్మానించడం జరిగింది. ఈ సమావేశంలో గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య గారు, మున్సిపల్ చైర్మన్ బండారి అనూష సతీష్, ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్ గఇంచార్జ్ లు కంది శ్రీనివాస్ రెడ్డి , ఆడే గజేందర్ గారు, మాజీ డిసిసి అధ్యక్షులు సాజిద్ ఖాన్ , మాజీ టిపిసిసి ప్రధాన కార్యదర్శి గండ్ర సుజాత ,మాజీ ఎంపీ సోయం బాపురావు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ్ రెడ్డి గారు, మాజీ డీసీసీబీ (DCCB) చైర్మన్ అడ్డి భోజారెడ్డి గారు, సీనియర్ నాయకులు ఏలేటి అశ్విన్ రెడ్డి మరియు మార్కెట్ చైర్మన్ లు, ఇతర కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కౌన్సిలర్ లు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బహిరంగ ధూమపానాన్ని ప్రోత్సహిస్తున్న ఆరుగురు దుకాణ యజమానులపై చర్యలు..గ్రీన్ మ్యాట్‌లు ఏర్పాటు చేసి ధూమపానానికి ప్రోత్సాహం..

## ప్రత్యేక డ్రైవ్‌లో ఆరుగురిపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో పెట్టీ కేసులు నమోదు : వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి సునీల్ కుమార్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్ పట్టణంలో బహిరంగ ధూమపానాన్ని ప్రోత్సహిస్తూ తమ దుకాణాల వద్ద గ్రీన్ మ్యాట్‌లు ఏర్పాటు చేసిన ఆరుగురు దుకాణ యజమానులపై కేసులు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ బి. సునీల్ కుమార్ తెలిపారు. ఈరోజు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ఆదేశాల మేరకు వన్‌టౌన్ పోలీసులు పట్టణంలోని స్టేడియం పరిసర ప్రాంతాలు, ఖానాపూర్, బొక్కలగూడ, కుమ్మరికుంట, శాంతినగర్, అంబేద్కర్ నగర్ తదితర ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. తనిఖీలలో భాగంగా దుకాణాల వద్ద గ్రీన్ మ్యాట్‌లు ఏర్పాటు చేసి ప్రజలను బహిరంగ ధూమపానానికి ప్రోత్సహిస్తున్న ఆరుగురు దుకాణ యజమానులను గుర్తించి వారి పై కేసులు నమోదు చేశారు.

కేసు నమోదు చేయబడిన నిందితులు:

1. మిట్టత్ రాజారపు శంకర్ కుమారుడు, వయస్సు 50 సంవత్సరాలు, కిరాణా దుకాణం, కుమ్మరికుంట.
2. పెద్దపల్లి సాయితేజ రాజేశ్వర్ కుమారుడు, వయస్సు 28 సంవత్సరాలు, కిరాణా దుకాణం, కుమ్మరికుంట.
3. ఎం.డి. సిరాజ్ బుర్హాన్ కుమారుడు, వయస్సు 39 సంవత్సరాలు, బేకరీ వ్యాపారి, మసూద్ నగర్.
4. సయ్యద్ ఆసిఫ్ సయ్యద్ అఫీజ్ కుమారుడు, వయస్సు 35 సంవత్సరాలు, పాన్ షాప్, శాంతినగర్.
5. షేక్ అహ్మద్ షేక్ నాసర్ కుమారుడు, వయస్సు 55 సంవత్సరాలు, పాన్ షాప్, అంబేద్కర్ నగర్.
6. ఎస్.డి. షోయబ్ ఎస్.డి. జాఫర్ కుమారుడు, వయస్సు 27 సంవత్సరాలు, పాన్ షాప్, శాంతినగర్.


ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని బహిరంగ ధూమపానం పై నిరంతరం ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ బి. సునీల్ కుమార్ హెచ్చరించారు. వీటి వల్ల గంజాయి లాంటి నిషేధిత పదార్థాలు యువత సేవించే అవకాశాలు ఉన్నందున ఇలాంటి వాటిపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మరల తిరిగి వీటిని ప్రోత్సహించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# జిల్లా కేంద్రంలో ప్రెస్ క్లబ్ భవనాన్ని ఏర్పాటు చేయాలి : తెలంగాణా జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు షానూర్




అమృత్ తెలంగాణ యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ప్రెస్ క్లబ్ భవనాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా అన్నారు. ఆదివారం రోజున టీ జె ఏ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం లో పనిచేస్తున్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల కోసం ప్రభుత్వం స్థలాన్ని కేటాయించి ప్రెస్ క్లబ్ భవనాన్ని నిర్మించి ఇవ్వాలని కోరారు. ఇప్పటివరకు జిల్లా లో ప్రెస్ క్లబ్ భవనం లేకపోవడం చాలా దారుణమని అన్నారు. జిల్లా కేంద్రం, వివిధ మండల జర్నలిస్టుల సమస్యలను వివరించడానికి ఒక వేదిక లేకపోవడం వల్ల జర్నలిస్టులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే,అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోపరాజు వెంకన్న జిల్లా ఉపాధ్యక్షులు ఖదీర్,రెహమాన్,జిల్లా ప్రచార కార్యదర్శి సిరిల్, సభ్యులు అల్తాఫ్ లు పాల్గొన్నారు.

# అండర్ గ్రౌండ్ పనులపై కలెక్టర్ ఆగ్రహం.. సమగ్ర కార్యాచరణ ప్రణాళికకు ఆదేశం..



అమృత్ తెలంగాణ సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అండర్ గ్రౌండ్ పనుల నిర్వహణ తీరుపై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అసంతృప్తి వ్యక్తం చేశారు.ఆదివారం జిల్లా ఐడీఓసీ కార్యాలయంలో ప్రజారోగ్య శాఖ, మున్సిపల్ అధికారులు, కాంట్రాక్ట్ ఏజెన్సీ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రజారోగ్య శాఖ ఆధ్వర్యంలో 'కె.ఎన్.ఆర్ కన్స్ట్రక్షన్ లిమిటెడ్ సంస్థ చేపడుతున్న పనుల పురోగతిని ఈ సందర్భంగా ఆయన పరిశీలించారు.పనుల జాప్యంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. పట్టణంలో యూజీడీ పనులు అత్యంత నిర్లక్ష్యపూర్వకంగా సాగుతున్నాయని మండిపడ్డారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజి పైపులు, మ్యాన్‌హోల్‌ల నిర్మాణం కోసం రోడ్లను తవ్వేసి, నెలల తరబడి వాటికి సిమెంట్ కాంక్రీట్ పనులు చేయకుండా వదిలేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనివల్ల సాధారణ ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ట్రాఫిక్‌కు పెద్ద ఎత్తున అంతరాయం కలుగుతోందని గుర్తుచేశారు. పైపులైన్లు, మ్యాన్‌హోల్‌ల నిర్మాణం పూర్తయిన వెంటనే తవ్విన గోతులను పూడ్చకపోవడం ముమ్మాటికీ నిర్లక్ష్యమేనని తవ్వకాల సమయంలో దెబ్బతిన్న తాగునీటి పైపులైన్లు, ఇతర ప్రజా వినియోగ సదుపాయాలను సకాలంలో పునరుద్ధరించకపోవడం వల్ల ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడాల్సి వస్తోందని కలెక్టర్ అధికారులను హెచ్చరించారు. పనుల్లో వేగం పెంచడంతో పాటు ప్రజల ఇబ్బందులను తక్షణమే తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. యూజీడీ పనులు చేపట్టిన అన్ని ప్రాంతాల్లో సీసీ రోడ్ల పునరుద్ధరణకు సంబంధించి రోడ్డు వారీగా వివరాలు, టైం లైన్ తో యాక్షన్ ప్లాన్‌ను వెంటనే సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజారోగ్య శాఖ, కాంట్రాక్ట్ ఏజెన్సీ సమన్వయంతో పనిచేసి, దెబ్బతిన్న మౌలిక వసతులను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలని, మున్సిపల్ అధికారులు కూడా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో నల్గొండ ప్రజారోగ్య శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిరణ్ కుమార్, ప్రజారోగ్య శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లు అనిల్ కుమార్, రమాదేవి, కేఎన్ఆర్ కన్స్ట్రక్షన్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు నీతిగా ఉంటూ సమాజ హితం కోసం పనిచేయాలి





అమృత్ తెలంగాణ నీతిగా, నిజాయితీగా ఉంటూ సమాజా హితం కోసం ప్రతి ఒక్కరు పనిచేయాలని శ్రీ రామకృష్ణ విద్యాలయం కరస్పాండెంట్ బండి రాజుల శంకర్ అన్నారు. ఆలేరు పట్టణంలో దినేష్ గార్డెన్ లో ఆదివారం 2005-06 సంవత్సరం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ దేశాల నుండి వలస వచ్చిన వారి పాలనలో, మనం బానిసలుగా బ్రతకాల్సి వచ్చిందని చెప్పారు. ఎందరో త్యాగదనుల ఉద్యమాలతో తిరిగి స్వాతంత్రం సిద్ధించిందన్నారు. మంచి పేరు ప్రతిష్టాలు గల వ్యక్తులు దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. క్రమశిక్షణతో ఎదిగిన వివేకానందుడు మన దేశ గొప్పతనాన్ని విదేశాలలో చాటారన్నారు. ప్రపంచానికి మన దేశం, జ్ఞానం అందించిందని వివరించారు. తినడానికి తిండి ఉంటే చాలని, నిజాయితీగా బ్రతకడం అవసరమన్నారు. క్రమశిక్షణకు, సంస్కారానికి మారుపేరుగా శ్రీ రామకృష్ణ విద్యాలయం విద్యార్థులు ఎదగాలన్నారు. దేశం,మెరుగైన సమాజం కోరుతూ, ధర్మం, న్యాయాన్ని కాపాడాలని, తల్లిదండ్రులను గురువులను మర్చిపోవద్దని హితవు పలికారు. నేటి పాలకులు చెప్పేది ఒకటి చేసేదొకటని ప్రస్తుత రాజకీయ పరిస్థితుల గురించి వివరించారు. మాతృభాషను పక్కనపెట్టి, ఇంగ్లీష్ వెంట పడుతున్నారని, ఇంగ్లీషులో ఉపయోగించుకుంటూనే, మాతృభాషకు పెద్దపీట వేయాలని సూచించారు. ప్రపంచ దేశాలలో మన విద్యా వ్యవస్థ ని, సంస్కృతి సాంప్రదాయాలను గౌరవిస్తూ ఉన్నారని గుర్తు చేశారు. మాతృభాష తల్లి లాంటిదని, పరిరక్షించుకోవాలని సూచించారు. విద్యార్థులు ఉన్నత స్థానాలలో ఉన్నప్పుడే, గురుదక్షిణ చెల్లించినట్లు అవుతుందన్నారు. విద్యార్థులకు బోధన చేయడం ద్వారా ఆచార్యులు నిత్య విద్యార్థులని తెలియజేశారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో 20 ఏండ్ల తర్వాత ఒకే వేదికపైకి చేరిన పూర్వ విద్యార్థులు గత కాలపు తీపి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ,చదువుకున్న పాఠశాలను, తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. వందేమాతరం గీతంతో ప్రారంభమై, జ్యోతి ప్రజ్వలన అనంతరం దివంగత బీమాగాని దివ్యభారతీ, బర్ల సంపత్‌లకు నివాళులర్పించారు. ఉపాధ్యాయురాలు గుగ్గిళ్ల జయమ్మ,బోడిగం వెంకట్ రెడ్డి,బూడిద దీపక్,అల్వాల ప్రసాద్,పోతుగంటి సంపత్‌కుమార్, చింతకింది కృష్ణ, అలె ప్రభ, గుడుకుంట్ల యాకుబ్, గడసంతల భాస్కర్ హాజరయ్యారు. పూర్వ విద్యార్థుల ఆలేటి మల్లేశం, పరిగెల జయంతి సమావేశానికి అధ్యక్షత వహించారు. పూర్వ విద్యార్థులు కౌన్సిలర్ జూకంటి సంపత్,బాల్ దే కృష్ణ , ఆలేటి సంతోష్, కందుకూరు మల్లేష్, తోట మాధురి, చిమ్మి మమత, కర్రే జగన్మోహన్, శ్రీకాంత్, ఆలేటి స్రవంతి, చెక్క రాజు పూర్వ విద్యార్థుల అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# హనుమాన్ ట్రైనింగ్ సెంటర్ విద్యార్థులు ఇండియన్ ఆర్మీకి ఎంపిక

అమృత్ తెలంగాణ :యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని "హనుమాన్ ఉచిత శిక్షణ కేంద్రం" లో శిక్షణ పొందిన ఇద్దరు గ్రామీణ ప్రాంత విద్యార్థులు భారత సైన్యానికి (ఇండియన్ ఆర్మీ) ఎంపికయ్యారు. అడ్డగూడూరు మండలం, డి. రేపాక గ్రామానికి చెందిన ముక్కామల ఎలేందర్ యాదవ్ అదే గ్రామానికి చెందిన బోనుగు విక్రాంత్ రెడ్డి లు కఠోర శ్రమ, క్రమశిక్షణతో ఆర్మీ ఉద్యోగాలు సాధించారని సంస్థ వ్యవస్థాపకులు, శిక్షకులు మాటూరి వినోద్, కోనేటి గోపాల్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ?ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు దేశ సేవ చేసే భాగ్యం కలగడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. హనుమాన్ ట్రైనింగ్ సెంటర్‌లో అందించిన ఉచిత శారీరక, మానసిక శిక్షణను సద్వినియోగం చేసుకుని ఈ ఇద్దరు యువకులు మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించడం అభినందనీయమన్నారు. సొంత ఊరికి, కన్న తల్లిదండ్రులకు, తమ శిక్షణ కేంద్రానికి మంచి పేరు తెచ్చిన ఈలేందర్ యాదవ్, విక్రాంత్ రెడ్డిలను నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందించి, వారి భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే రోజుల్లో మరికొంత మంది యువకులను సైన్యంలో చేరేలా ఉచిత శిక్షణ అందిస్తామని వారు పేర్కొన్నారు. వీరి ఎంపిక పట్ల జిల్లా యువజన క్రీడల అధికారి ధనుంజయ్ , అథ్లెటిక్స్ అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు పోతంశెట్టి వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు శుభాకాంక్షలు తెలిపారని హనుమాన్ ట్రైనింగ్ సెంటర్ కోచ్ కోనేటి గోపాల్ తెలియజేశారు.

# మేరు సేవా సంఘం నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైనా ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్




జగిత్యాల అమృత్ తెలంగాణ మే 31: పట్టణ మేరు సేవా సంఘం లో మేరు సేవా సంఘం నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరై నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య అనంతరం అతిధులను శాలువా తో సత్కరించారు. ఈకార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అడువల జ్యోతి లక్ష్మణ్ మాజీ కౌన్సిలర్ దాసరి లావణ్య ప్రవీణ్ ,సంఘం అధ్యక్షులు రాపర్తి వినోద్ ప్రధాన కార్యదర్శి గట్ల శ్రీనివాస్ ఉప అధ్యక్షులు సత్యనారాయణ సహాయ కార్యదర్శి రాయిళ్ళ శ్రీదర్ కోశాధికారి గట్ల శ్రీకర్ మాజీ అధ్యక్షుడు మల్లేశం పట్టణ నాయకులు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# EHS డిడక్షన్ సమంజసం కాదు - TUTF



తుమ్మ లచ్చిరాం, టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు.



పాటిమీది రఘు నందన్ రెడ్డి, టీయూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ EHS విధివిధానాలు ఖరారు కాకముందే ఉద్యోగ, ఉపాధ్యాయుల వేతనాల నుండి మే నెలలో 1.5% చందా డిడక్షన్ చేయడం సమంజసం కాదని, ఇది ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేయడమేనని, ఈ చర్యను తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (TUTF) రాష్ట్ర శాఖ పక్షాన తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి తుమ్మ లచ్చిరాం,పి.రఘునందన్ రెడ్డిలు తెలిపారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రత కోసం ప్రవేశపెడుతున్న ఈ స్కీము నమోదు ప్రక్రియ చేపట్టినప్పటి నుండి అశాస్త్రీయంగా కొనసాగుతుందని ఆరోపించారు. భార్యా భర్తలిద్దరూ ఉద్యోగులు అయితే, తల్లి లేదా తండ్రి పెన్షనర్ అయితే మినహాయింపు ఏ విధంగా చేపట్టాలో స్పష్టత కరువైందన్నారు . అసలు ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో ఏ విషయాలు చర్చించిందో బయటపెట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చొరవ తీసుకొని సమస్య పరిష్కారం కొరకు కృషి చేయాలని కోరారు. హడావిడిగా ఉద్యోగుల జీతాల నుండి కోత విధించడంతో పథకం అమలు పట్ల అనుమానాలు ఉన్నాయని అన్నారు. ఆరోగ్య పథకం అమలుకు సంబంధించిన మార్గదర్శకాలను అధికారికంగా విడుదల చేసిన తర్వాత మాత్రమే చందా మినహాయింపు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

తుమ్మ లచ్చిరాం<br>
రాష్ట్ర అధ్యక్షులు,<br>
పి.రఘునందన్ రెడ్డి<br>
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,

# రైతుల సహనం పరీక్షించొద్దు..రెండు రోజుల్లో అందరూ రైతులు ఇంటికి వెళ్లిపోయేలా చూడాలి..

## రైతులకు ఇబ్బందులు కలగకూడదనే ఉద్యేశంతోనే నియోజకవర్గంలో 16 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం : బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ బోథ్ నియోజకవర్గంలోని కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు పడుతున్న రైతుల పంటలను పూర్తిస్థాయిలో కొనుగోలు చేసుకొని రెండు రోజుల్లో రైతులను ఇంటికి పంపాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అధికారులు మార్క్‌ఫెడ్ అధికారులను ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగొద్దనే ముందుచూపు ఆలోచనతోనే నియోజకవర్గంలో మొదటిసారిగా 16 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఏది ఏమైనా రెండు రోజుల్లో రైతులకు పట్టీలు అందజేసి ఇండ్లకు పంపించెయ్యాలని, వర్షాలు పడే సమయాల్లో రైతుల సహనాన్ని పరీక్షించొద్దని సూచించారు. మార్క్‌ఫెడ్ డిఎం, మరియు సంబంధిత అధికారులు ఉన్నారు.

# పెద్దపెల్లి ఎంపీ ని కలిసిన కౌన్సిలర్ అంబకంటి అశోక్



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్ స్వర్గీయ చిలుకూరి రామచంద్ర రెడ్డి నివాసంలో అదిలాబాద్ ఇంచార్జ్ పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గౌరవనీయుల గడ్డశీ వంశీ కృష్ణ స్వర్గీయ మాజీ మంత్రివర్యులు చిలుకూరి రామచంద్ర రెడ్డి చిత్రపటానికి వారికి ఘన నివాళులర్పించారు తదనంతరం పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుల గడ్డంని వంశీకృష్ణ ని శాలువాతో సత్కరించిన సీనియర్ నాయకులు చిలుకూరి లక్ష్మారెడ్డి మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి హిమాభిషేక అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్ , ఓ బి సి జిల్లా అధ్యక్షులు అంబకంటి అశోక్ మాజీ కౌన్సిలర్ చిన్న స్వామి మాజీ ఎంపీటీసీ సంజయ్ దూబే దేవదాస్ చారి తిప్ప నారాయణ గారు రామారావు

# ద్విచక్ర వాహనం ఢీకొడంతో బిక్షాటన చేసే వ్యక్తికి తీవ్ర గాయాలు



అమృత్ తెలంగాణ ఆలేరు పట్టణంలో హైదరాబాద్ వరంగల్ జాతీయ రహదారిపై బిక్షాటన చేసుకుంటున్నా గుర్తుతెలియని వ్యక్తికి శనివారం రాత్రి ద్విచక్ర వాహనం ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని బైపాస్ రోడ్ లో చత్రపతి శివాజీ దాబా వద్ద రోడ్డుపై వెళ్తున్న భిక్షాటన చేసే ప్రభాకర్ వయస్సు (65), టీఎస్ జీరో 8 హెచ్ వై 4298 నెంబర్ గల ద్విచక్ర వాహనం ఢీకొంది. తీవ్ర గాయాలు కాగా 100 డయల్ సమాచారంతో హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ మరియు పోలీసులు అక్కడికి చేరుకొని, స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం జనగామ జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కొరకు వరంగల్ జిల్లా కేంద్రంలోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

# స్త్రీనిధి నియామకాల్లో ఇష్టారాజ్యం

అమృత్ తెలంగాణ స్త్రీనిధి పరపతి సహకార సమాఖ్య లిమిటెడ్‌లో ఉద్యోగ నియామకాల ప్రక్రియ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతోందని నిరుద్యోగ యువత ఆరోపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం గరిష్ఠ వయోపరిమితిని 44 సంవత్సరాలకు పెంచుతూ జీవో నెం.86 జారీ చేసినప్పటికీ, స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల నియామకాల్లో మాత్రం కేవలం 30 సంవత్సరాల వయోపరిమితినే అమలు చేయడం వల్ల వేలాది మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసే అవకాశాన్ని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో దశాబ్దకాలంగా నిర్ణీత సమయంలో ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయకపోవడంతో రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగ యువత వయోపరిమితి కారణంగా ఉద్యోగ అవకాశాలకు దూరమయ్యారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నిరుద్యోగుల డిమాండ్ మేరకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఈ నెల 18న ప్రభుత్వ ఉద్యోగాల గరిష్ఠ వయోపరిమితిని 44 సంవత్సరాలకు పెంచుతూ జీవో నెం.86 జారీ చేయడాన్ని స్వాగతించిన నిరుద్యోగులు, అదే సడలింపును స్త్రీనిధి నియామకాల్లో కూడా అమలు చేయాలని కోరుతున్నారు. ఇటీవల విడుదల చేసిన స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ ఉద్యోగాల నోటిఫికేషన్‌లో గరిష్ఠ వయోపరిమితిని 30 సంవత్సరాలుగా పేర్కొనడమే కాకుండా, మే 29ను దరఖాస్తుల చివరి తేదీగా నిర్ణయించడం వల్ల అనేక మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కోల్పోయారని తెలిపారు. వయోపరిమితిని 44 సంవత్సరాలకు పెంచి, దరఖాస్తు గడువును పొడిగించాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా తెలంగాణ ప్రభుత్వం జీవో ఎం.ఎస్. నెం.33 (30 సెప్టెంబర్ 2022) ద్వారా విద్యాసంస్థలు, ప్రభుత్వ నియామకాల్లో ఎస్టీ రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, స్త్రీనిధి నియామకాల్లో మాత్రం ఇప్పటికీ పాత 6 శాతం రిజర్వేషన్లనే అమలు చేస్తున్నారని నిరుద్యోగులు ఆరోపించారు. ఎస్టీ రిజర్వేషన్లను 10 శాతానికి పెంచడంతో పాటు ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 2025-26 మార్చిలో జరిగిన స్త్రీనిధి జనరల్ బాడీ సమావేశంలో మొత్తం 163 ఖాళీల భర్తీకి సభ్యులు ఆమోదం తెలిపినప్పటికీ, అనంతరం ఏప్రిల్ 29 మరియు మే 9 తేదీల్లో విడుదల చేసిన నోటిఫికేషన్లలో కేవలం 153 పోస్టుల భర్తీకే అవకాశం కల్పించారని తెలిపారు. మిగిలిన 10 పోస్టులను మంత్రుల పేషీల సిబ్బంది, రాజకీయ నాయకుల అనుచరులకు కేటాయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని నిరుద్యోగులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇక 2018 నుంచి ఇప్పటివరకు స్త్రీనిధిలో సుమారు 450 మంది సిబ్బంది రాజీనామా చేశారని, అందులో 90 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన వారేనని పేర్కొన్నారు. మాజీ మేనేజింగ్ డైరెక్టర్ విద్యాసాగర్‌రెడ్డి వేధింపుల కారణంగానే ఈ రాజీనామాలు జరిగాయని ఆరోపించారు. ఈ విషయమై గతంలో రాజీనామా చేసిన అభ్యర్థులు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్త్రీనిధి నియామకాల్లో జీవో నెం.86 ప్రకారం వయోపరిమితి సడలింపు, జీవో నెం.33 ప్రకారం ఎస్టీ రిజర్వేషన్ల పెంపు, ఎస్సీ-ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, బీసీలకు 27 శాతం రిజర్వేషన్ల అమలు వంటి అంశాలను విస్మరించి పాత రోస్టర్ పాయింట్ల ఆధారంగా నోటిఫికేషన్ విడుదల చేయడం అన్యాయమని నిరుద్యోగులు విమర్శించారు. ఈ సమస్యల పరిష్కారం కోసం మే 22న పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, సీఎం ప్రజావాణి నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌కు వినతిపత్రం సమర్పించినట్లు నిరుద్యోగ యువత తెలిపారు. ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకుని స్త్రీనిధి నియామకాల్లో న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

## మాల సంక్షేమ సంఘం ఆదిలాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ కి ఘన స్వాగతం పలకడం జరిగింద



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ మధ్యాహ్నం రెండు గంటలకు గౌరవనీయులైన పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ మాల సంక్షేమ సంఘం ఆదిలాబాద్ జిల్లా శాఖ భవనానికి విచ్చేసిన సందర్భంగా మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కొప్పుల రమేష్ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి సుధాకర్ గారు మరియు మాల సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు ఘనస్వాగతం పలకడం జరిగింది. మాల సంక్షేమ సంఘం జిల్లా శాఖ భవనంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కొప్పుల రమేష్ మాట్లాడుతూ మాలలకు వర్గీకరణ విషయంలో చాలా అన్యాయం జరిగిందని తెలియజేశారు. రోస్టర్ పాయింట్లు 22 లోపు ఒక్క పోస్టు కూడా మాలలకు కేటాయించలేదని తెలియజేశారు. కావున పార్లమెంటులో ఈ విషయాన్ని లేవనెత్తాలని మాలలకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించి న్యాయం చేకూర్చాలని తెలియజేశారు. లేనిచో వచ్చే ఎన్నికలలో మాలల ఓట్లు ఎటు వేయాలో మేము నిర్ణయించుకుంటామని తెలియజేయడం జరిగింది. గౌరవనీయులైన పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ తప్పకుండా మాలలకు న్యాయం చేయడానికి పార్లమెంట్లో కూడా మాట్లాడి న్యాయం జరిగేటట్లు చూస్తానని తెలియజేశారు. అలాగే జిల్లా శాఖ భవనానికి ప్రహరీ గోడ నిర్మాణానికి మరియు ఇతర అవసరాల నిమిత్తం రూపాయలు 40 లక్షలు అతి త్వరలోనే అందజేయడానికి ప్రయత్నం చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కొప్పుల రమేష్ , ప్రధాన కార్యదర్శి బొబ్బిలి సుధాకర్ జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లన్న వ్యవస్థాపక అధ్యక్షులు బేర దేవన్న మాజీ అధ్యక్షులు సూరం భగవాండ్లు , మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్ గారు,జిల్లా అసోసియేట్ అధ్యక్షులు శ్రీ పాశం రాఘవేంద్ర గారు, పిప్పల్ కోటి సర్పంచ్ రమేష్ ,మలపతి సుభాష్ , మేదరి స్వామి బోండ్ల వెంకటస్వామి గారు, మల్లెల అశోక్ , ఏర సుధీర్ సృజన్ చిలుక పొచ్చన్న , డిసిసిబి అధ్యక్షులు నరేష్ జాదవ్ జిల్లా కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు శ్రీ కంది శ్రీనివాస్ రెడ్డి ప్రవీణ్ రెడ్డి గారు, ఆత్మ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు , జడ్పిటిసి సభ్యులు గోక గణేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# చెరువును కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

అమృత్ తెలంగాణ మండలంలోని మందపల్లి గ్రామంలో అల్లం వారి కుంట 20 ఎకరాల పైగా ఉన్న చెరువు, పూర్తిగా కబ్జాకు గురి అయి ప్రస్తుతం రెండెకరాలే ఉందని దీంతో చెరువు ఆయకట్టు కింద ఉన్న పంట పొలాలు పూర్తిగా పండే అవకాశాలు లేవని మందపల్లి గ్రామ ప్రజలు ఆదివారం జన్నారం ప్రెస్క్లబ్లో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అలాగే గొల్ల కుంట చెరువు 10 ఎకరాలు ఉంటే ప్రస్తుతం మూడెకరాలే ఉందన్నారు. ఊరకుంట చెరువు అయితే పూర్తిగా కబ్జా అయిందన్నారు. ఈ చెరువుల కింద ఉన్న భూములు ఎడారులుగా మారే పరిస్థితి ఉందన్నారు. కబ్జా చేసిన వారిని ప్రభుత్వం రెవెన్యూ అధికారులు గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో ఉన్న నలుగురు పెద్దమనుషులు, చెరువు భూములను కబ్జాలు చేస్తూ లక్షల రూపాయలకు విక్రయిస్తున్నారన్నారు. చెరువులు లేక వేసవిలో బోరు బావులు బావులు అడుగంటిపోతున్నాయన్నారు. చెరువు పై ఆధారపడి జీవిస్తున్న పశుపక్షాదులు కూడా నీరు లేక తల్లా దిల్లుతున్నాయన్నారు. కబ్జా ఆయన చెరువులను అన్నిటిని గుర్తించి వాటికి హద్దులు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఈ చెరువుల కబ్జాపై, తాసిల్దార్ కలెక్టర్ కు ఫిర్యాదు చేశామన్నారు. రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల వరకు వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మందపల్లి గ్రామస్తులు సముద్రాల శంకర్, ఆకుల భీమన్న ఆకుల సత్యవ్వ ఎండి లతీఫా హబీబా బేగం ఆకుల రజిత బాలిక సువర్ణ, బాల్త వెంకటవ తదితరులు ఉన్నారు.

# సుంకరనేని శ్రీనాథ్ కి ఘన నివాళి




అమృత్ తెలంగాణ ఆలేరు పట్టణంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో అసిస్టెంట్ ట్రైనింగ్ అధికారిగా పనిచేస్తున్న సుంకరనేని శ్రీనాథ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాగా, శ్రీనాద్ కుటుంబ సభ్యులను, యాదాద్రి భువనగిరి జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ గౌడ్ ఆదివారం పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించి బిజెపి పార్టీ తరుపున వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాదూరి అచ్చయ్య , జిల్లా కార్యదర్శి కామిటికారి కృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శి ఏలగల వెంకటేష్, మండల కార్యదర్శి బైరి మహేందర్ గౌడ్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# 100 కోట్లు పెట్టి రెండు డూప్లెక్సులు కొన్న నటి!



కోటి సంపాదన .. సామాన్యుడు ఊహించలేనిది. కోట్లు సంపాదించాలనేది మధ్యతరగతి ఆలోచన.. అది ఒక అందమైన కల. కానీ ఇవన్నీ పాజిబులేనా? భారీగా వ్యాపారాలు చేసే ఎగువ మధ్యతరగతి కొంతవరకూ డబ్బు వేటలో సక్సెసైనా కానీ మధ్య తరగతి ఎప్పటికీ ఎదుగూబొదుగూ లేకుండా ఉండడమే జగమెరిగిన సత్యం. కానీ సినీరంగంలో కథానాయికగా ఆరంగేట్రం చేసిన ప్రముఖ యువనటి కేవలం నాలుగైదేళ్లలోనే భారీ ఆర్జనతో సంచలనంగా మారుతోంది. ఏడాదిలోనే 100 కోట్లతో రెండు డూప్లెక్స్ అపార్ట్ మెంట్లు కొనుక్కుంది అంటే ఊహించండి. అయితే ఇందులో కొంత తన తండ్రి గారి సంపాదన కూడా ఉంది లెండి. ఇదంతా ఎవరి గురించి అంటే.. తండ్రి కూతుళ్లు జాన్వీ కపూర్ - బోనీకపూర్ గురించే. జాన్వీ కెరీర్ లో ఒక్కో మెట్టు తీర్చిదిద్దుతూ బోనీ కపూర్ కోట్లాది రూపాయల పారితోషికాలను ఆర్జించడమెలానో... ఒక పాపులర్ నిర్మాతగా ఫక్తు బిజినెస్ మేన్ గా వందశాతం సక్సెస్ రేటుతో దూసుకెళ్లడమెలానో ఇతరులకు నేర్పిస్తున్నారని చెప్పాలి. అతడు పట్టిందల్లా బంగారంగా మారుతోంది. బోనీ నిర్మించిన తమిళ తెలుగు చిత్రాలు చక్కని విజయాలు సాధిస్తున్నాయి. మరోవైపు జాన్వీ కపూర్ ఒక్కో సినిమాకి బాలీవుడ్ లో 3-4 కోట్ల పారితోషికం అందుకుంటూ ఏడాదికి అరడజను సినిమాలు చేసేస్తూ మరోవైపు వాణిజ్య ప్రకటనలతోను భారీగానే ఆర్జిస్తోంది. నిర్మాతగా బోనీ సంపాదనకు కూతురు జాన్వీ సంపాదన అదనం. ఇదంతా ఇప్పుడు అసాధారణ ఆస్తిగా మారుతోంది. జాన్వీ కుటుంబం తాజాగా రూ. 65 కోట్లతో ముంబై ప్రైమ్ లొకేషన్ లో ఆస్తిని కొనుగోలు చేశారనేది తాజా వార్త. జాన్వీ కపూర్ కుటుంబం ముంబైలోని బాంద్రా వెస్ట్ ప్రాంతంలో రూ.65 కోట్లతో డ్యూప్లెక్స్ అపార్ట్ మెంట్ ను కొనుగోలు చేసారని సమాచారం. 6421 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో భారీ భవనంలోని మొదటి - రెండవ అంతస్తులలో ఈ డూప్లెక్స్ ఉంది. ఈ ఆస్తిని జాన్వీ- ఆమె తండ్రి బోనీ కపూర్- సోదరి ఖుషీ కపూర్ సంయుక్తంగా కొనుగోలు చేశారు.

# అప్సరస అందాలకు ఎవరైన పడిపోవాల్సిందే..!



ఈమధ్య ఆర్జీవి ప్రమోట్ చేస్తున్న భామలకు మంచి డిమాండ్ ఏర్పడుతుంది. ఆర్జీవి బోల్డ్ సినిమాల్లో నటిస్తే టాలీవుడ్ లో వరుస అవకాశాలు దక్కినట్టే ఈ ఫార్ములాని కనిపెట్టిన అప్సరా రాణి ఆయన చేసిన రెండు సినిమాల్లో నటించింది. అందులో ఒకటి థ్రిల్లర్ కాగా రెండవది డేంజరస్. ఆర్జీవి ఫోకస్ అంతా అప్సరా అందాల మీద ఉంచడంతో అమ్మడికి బాగానే ఫాలోయింగ్ ఏర్పడింది. ఆ దెబ్బతో అప్సరాకి స్పెషల్ ఐటం సాంగ్ ఆఫర్లు వస్తున్నాయి. క్రాక్ లో భూం బద్దలు సాంగ్ తో ఓ ఊపు ఊపేసింది అప్సరా రాణి. ఆ సాంగ్ తో అమ్మడి క్రేజ్ మరింత పెరిగిందని చెప్పొచ్చు. ప్రస్తుతం ఐటం సాంగ్స్ లో స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలుస్తున్న అప్సరా రాణి కేవలం సినిమాలతోనే కాదు సోషల్ మీడియాలో కూడా అందాల ప్రదర్శనతో అదరగొట్టేస్తుంది. బికినీ షోలతో సోషల్ మీడియాని షేక్ చేస్తున్న అమ్మడు తన ఫాలోవర్స్ ని ఎంటర్టైన్ చేయడమే ముఖ్య ఉద్దేశంగా పెట్టుకుంది. అందుకే ఎలాంటి మొహమాటం లేకుండా తన అందాలతో గ్లామర్ ట్రీట్ అందిస్తుంది. లేటెస్ట్ గా అప్సరా రాణి శారీ లుక్ తో ఆకర్షిస్తుంది. కొత్త సినిమా ఓపెనింగ్ కి వచ్చిన అమ్మడు అక్కడ శారీ లో ఫోటో షూట్ ఇచ్చింది. కట్టింది శారీనే కానీ స్లీవ్ లెస్ బ్లౌజ్ తో హాట్ అప్పీల్ చేస్తుంది అప్సరా రాణి. టాలీవుడ్ లో ఐటం సాంగ్స్ తో స్పెషల్ క్రేజ్ తెచ్చుకోవాలని చూస్తున్న అప్సరా రాణికి ఆమె కోరినట్టే ఆఫర్లు వస్తున్నాయి. స్క్రీన్ మీద కనిపించడానికి ఎలాంటి పాత్ర అయినా సరే చేయడానికి సిద్ధమని చెబుతున్న అప్సరా రాణి తన గ్లామర్ ట్రీట్ తో ఫాలోవర్స్ కి నిద్రపట్టకుండా చేస్తుంది. లేటెస్ట్ గా శారీ లుక్ తో కనిపించిన అప్సరా రాణి అలా కూడా తన మెరుపులు మెరిపిస్తుంది. గ్లామర్ షోలో నో లిమిట్స్ మాత్రమే కాదు ఇంటిమేట్ సీన్స్ లో కూడా సై అనేస్తున్న అప్సరా రాణితో ఆర్జీవి ఇంకా ఏదో ప్లానింగ్ లో ఉన్నట్టు ఉన్నాడు. అందుకే ఆమెని రెగ్యులర్ గా ఫాలో అవుతూ అప్సరా రాణికి ట్యాగ్ చేస్తూ మెసేజ్ లను పోస్ట్ చేస్తూ ఉంటాడు. ఆర్జీవి వెలుగులోకి తీసుకొచ్చిన అందాల ముద్దుగుమ్మ అప్సరా రాణి ఆయనతో ఎలాంటి సినిమా అయినా చేయడానికి రెడీ అంటుంది. అందుకే అప్సరా నైనా గంగూలితో కలిసి ఓ లెస్బియన్ లవ్ స్టోరీ గా డేంజరస్ తీశాడు. ఆ సినిమాలో అప్సరా నైనాల పర్ఫార్మెన్స్ చూస్తే వీళ్లు నిజంగానే లెస్బియన్ అనేలా చేశారు. మొత్తానికి ఆర్జీవి బ్యూటీ తన కెరియర్ ని సెట్ రైట్ చేసుకునే క్రమంలో అదరగొట్టేస్తుంది. లేటెస్ట్ గా ఓ సినిమా ముహూర్తానికి వచ్చిన అప్సరా రాణి అక్కడ ఉన్న వారందరిని తన గ్లామర్ తో ఆకట్టుకుంది.

# హిందీ ఉలవచారు బిర్యానీకి ఆరేళ్ల తర్వాత మోక్షం




తెలుగు తో పాటు పలు భాషల్లో నటించి విలక్షణ నటుడు అనే పేరు దక్కించుకున్న ప్రకాష్ రాజ్ తన అభిరుచికి తగ్గట్లుగా విభిన్నమైన సినిమాలను నిర్మించడం మరియు డైరెక్ట్ చేయడం జరిగింది. ఆయన పలు సినిమాలను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చాడు. ముఖ్యంగా ఆయన నటించి దర్శకత్వం వహించిన ఉలవచారు బిర్యానీ సినిమా విమర్శకుల ప్రశంసలు దక్కించుకున్న విషయం తెల్సిందే. ఉలవచారు బిర్యానీ సినిమాను హిందీలో స్వయంగా తడ్కా టైటిల్ తో రీమేక్ చేయడం జరిగింది. రీమేక్ కు దర్శకత్వం వహించడంతో పాటు సహ నిర్వాతగా కూడా ప్రకాష్ రాజ్ వ్యవహరించాడు. అయితే ఒరిజినల్ వర్షన్ లో ప్రకాష్ రాజ్ కీలక పాత్రలో నటించాడు. అయితే రీమేక్ లో మాత్రం ఆ పాత్రను బాలీవుడ్ సీనియర్ నటుడు నానా పటేకర్ తో చేయించాడు. తడ్కా సినిమాను 2016 సంవత్సరంలో ప్రకాష్ రాజ్ మొదలు పెట్టాడు. ఈ చిత్రంలో శ్రియ మరియు తాప్సి లు కీలక పాత్రల్లో నటించారు. సినిమా షూటింగ్ కార్యక్రమాలు నత్తనడకన సాగి ఏదోలా పూర్తి చేసినప్పటికి కూడా విడుదల విషయంలో అనేక ఇబ్బందులను ఈ సినిమా ఎదుర్కొంటూ వచ్చింది.




# షర్ట్ బటన్స్ తీసి మరీ నడుమ అందాన్ని చూపుతున్న సీత



హిందీ ప్రేక్షకులకు చాలా కాలంగా ఎంటర్ టైన్ చేస్తున్న మృణాల్ ఠాకూర్ ఇటీవల తెలుగు సినిమా సీతారామం సినిమా తో తెలుగు ప్రేక్షకులను మైమరచి పోయేలా చేసింది అనడంలో సందేహం లేదు. హీరోయిన్ గా ఈ అమ్మడు తెలుగు లో వరుసగా సినిమాలు చేయాలంటూ ఇక్కడి ప్రేక్షకులు కోరుకుంటున్నారు. సీత పాత్రలో మృణాల్ ను చూసిన ప్రతి ఒక్కరు ఫిదా అయ్యారనే చెప్పాలి. గతంలో కూడా తెలుగు ప్రేక్షకులకు అప్పుడప్పుడు మృణాల్ ని చూశారు. కానీ సీతారామం సినిమా లో సీతను చూసిన నేపథ్యం లో ప్రతి ఒక్కరు కూడా నోరు తెరచి వావ్ అంటూ ఆమె అందంను పొగుడుతూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు అనడంలో సందేహం లేదు. ఇలాంటి సీతను ఈ మధ్య కాలంలో రకరకాలుగా తెలుగు ప్రేక్షకులు చూస్తూ ముక్కున వేలేసుకుంటున్నారు. సీతారామం సినిమా లో పద్దతైన సీత పాత్రలో కనిపించిన మృణాల్ ఈ మధ్య సోషల్ మీడియాలో ఫుల్ ఎక్స్ పోజింగ్ తో అందాల ఆరబోత చేస్తూ ఈమె ఆమేనా అనే అనుమానం కలిగేంతగా రచ్చ చేస్తోంది. ముద్దుగుమ్మ సీత తాజాగా ఈ వీడియో తో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. షర్ట్ కింది బటర్స్ విప్పేసి గాలికి షర్ట్ అలా పక్కకు తప్పుకుంటే వావ్ అనిపించేలా నడుము నాభి అందాలను చూపిస్తూ మృణాల్ కవ్విస్తోంది. సీత పాత్రలో నడుము నాభి అందాలను చూపించలేదు.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com